# ఋణానుబంధం

తన సొంతకూతుర్ని, సుజాతను వేరువేరుగా చూడవలసిన సందర్భాలు యీ అరవైయేళ్ళ జీవితంలోనూ రావుకు యింతవరకు కలగక పోవటం, పైగా యీ నాడు మధు మూలంగా అలాంటి సందర్భమే కలిగే అవకాశము కనిపించటం రావుకు విపరీతమైన బాధగానే ఉంది.

నిజానికి సుజాతే మొట్టమొదటగా రావుకు కుమార్తె రూపంలోవచ్చింది. నలభై ఏళ్ళు దాటిన తర్వాత తండ్రిని అనిపించుకునే యోగ్యత లేదనే భయం కలగటం, వత్సల తన స్మృతి చిహ్నమేమో అన్నట్లు సుజాతను కని యీ లోకాన్ని వీడిపోవటం, పార్వతమ్మ సుజాతను తన ఇంటికి తీసుకు రావటం, రావుకు అంతా చిత్రరూపంలోకనిపిస్తోంది. ''మనం తపించిపోతున్నామని మీ అప్ప, మనకోసం యీ అమ్మాయిని తన కడుపులో దాచి వుంచింది కాబోలు'' అని రావు అనేవాడు. పార్వతమ్మ పమిటకొంగుతో కనురెప్పల చివర్లను తుడుచుకోవటం కూడ రావు మరిచేపోలేదు. సంతానం అని తపించిపోతున్న రావు దంపతులను ఇరవైయేళ్లకు పైగా నిరాశా సముద్రంలో ముంచేసి పరాయి, తన అనే భేదం ఉండకూడదనే భావమేమో అన్నట్లు సుజాతను వీరికివ్వటం, తర్వాత సుమారు అయిదేళ్ళకు పార్వతమ్మ కడుపు పండటం, అరవైయేళ్ల రావు ప్రశాంతంగా సోఫాలో కూర్చుని విధి చిత్రం అని నిట్టూర్పు విడుస్తూ ఉంటాడు. ఆ వయస్సులో రావు యీవిధంగా కంటె ఇంకా యెలా ఆలోచించ కలుగుతాడు ?

సంతానం కోసం ఆదుర్దాపడ్డ రావుకు యిప్పుడిప్పుడే తన సంతానానికి సంతానం కలగాలనే కోర్కె కలగటంలో ఆశ్చర్యం లేదు. పార్వతమ్మ, ''వసంత, నా చిన్ని వసంత యెంత ముద్దోస్తోందో చూశారండి'' అని అంటూనే తన జీవితాన్ని సమాప్తం చేసుకుంది. రావు పార్వతమ్మ ఫొటో వంక చూసి

కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. పార్వతమ్మ పోవటంతో ఆ పెద్ద యిల్లంతా బోసిపోయినట్లయింది. ఆమె వుంటేనే ఆ యింటికి నిండు. ఆమె పోయింది. ఎందుకు సంతానం యివ్వటం? సంతానాన్ని చూసుకుని ముద్దులాడే యోగ్యత లేకుండా యెందుకు తీసుకుపోవటం, రవి అట్టేఆలోచిస్తూ రోజులు గడుపుతూ వుంటాడు.

రావుకు వసంత సుజాతలమధ్య భేదాలుకనిపించటంలేదు. తన సొంత కూతురనే భావము మనస్సులో యెప్పుడూ ప్రవేశించలేదు. పార్వతమ్మ, సుజాతను, వసంతకు యిచ్చిన పాలను త్రాగిందనే కోపంతో కొట్టిన సన్నివేశము, రావు కళ్ళకు కట్టినప్పుడల్లా ఆయన వళ్ళంతా జలదరించిపోయేది. సుజాత బిక్కముఖం వేసుకుని "నాన్నా, చూడు అమ్మ యెట్లా కొట్టిందో" అంటూ యేడుస్తూ, తన వళ్లోకి వాలిన సుజాత వదనం, రావు తనజీవితంలో మరిచిపోలేడు. అప్పుడు పార్వతమ్మను నిందించటం, పార్వతమ్మ బావురుమనటం, రావు నిస్సహాయుడై, యింట్లోంచి వెళ్ళిపోవటం, పార్వతమ్మ ఫొటోలో కనిపిస్తున్నాయి. పార్వతమ్మ ఫొటో కొంచెం ప్రక్కకు త్రిప్పేశాడు.

"నిజానికి యీ వయస్సులో నా హృదయంలో లేని భావాల్ని జీర్ణించుకోవాలసి రావటం, వీళ్ళిద్దరిలోను భేదము కనిపించటం భరించరాని బాధలు. నువ్వు వెళ్ళిపోయావు...." అంటూ అనకూడదేమోనని కొన్ని మాటలు మింగేశాడు. పార్వతమ్మ పోయినప్పటినుంచి, సుజాత, వసంత విషయంలో చెల్లెలనే భావంతో మెలుగుతూవుంటే రావు ఆనందం పట్టలేకపోయాడు. వీళ్ళిద్దరూ యీ లోకానికి రాకమునుపు, అందరి పిల్లల్నీ తన పిల్లలుగా చూసుకునే రావుకు అనాధ బాలురంటే అమితమైన జాలి, కరుణ వుండేది. అంతపెద్ద ఆస్తితో యిలాంటి పిల్లలకు చదువులు చెప్పించి, వాళ్ళు పెద్దవాళ్ళై, కుటుంబీకులై వుంటే తాను ఆనందిస్తూ యీలోకాన్ని విడిచిపోవాలనేదే రావు కోరిక. అందువల్లనే, మురళి కలెక్టరు చేస్తున్నాడని, సూరి విమానాల శాఖలో పెద్ద వుద్యోగస్థుడయ్యాడని, రత్నం రాజకీయాల్లోకి పోయాడని అతని గర్వం, అతని సంతృప్తి.

మధు, హఠాత్తుగా చదువులో అంతరాయం వచ్చిందని రావు దగ్గరకు రావటం, రావు, మధును స్వీకరించటం జరిగాయి. రావుకు మధు అంటే యెందుకో మొదటినుంచి అపరిమితమైన ప్రేమ. మధు తన చిన్ననాటినుంచి పడ్డ కష్టాలు చెపుతూవుంటే, రావుహృదయము కరిగిపోయేది. రావు ఆదుకోవటంతో, మధు కష్టాలన్నీ గట్టెక్కినట్లే. మధుకు సుజాతకు నెలల వ్యత్యాసం కంటె యెక్కువలేదు. నిమిష నిముషానికి తన జీవిత స్థిరత్వాన్ని శంకించే రావుకు తన కుమార్తె వివాహ విషయంలో ఆలోచిస్తూవుంటే, తన కళ్ళల్లో మధు మెసులుతూ వుంటాడు. మధు ఆ యింట్లోనే వుంటున్నా కూడా, సుజాత దృష్టిలో మధు. యింకో రూపంలో యెన్నడు కనిపించలేదు. వసంత ఎప్పుడైనా దుడుకుతనంగా మాట్లాడినప్పుడు మాత్రం, "మధు చాలా మంచి వాడు. నువ్వు తొందరపడుతున్నావు" అని మందలించేది సుజాత. అంతకంటే సుజాతకు వేరుదృష్టి లేకపోవటం, మధు మనస్సులో భావాలైనా పైకి చెప్పటానికి సాహసించలేకపోవటం, సుజాత, మధుపట్ల ప్రదర్శిస్తున్న చనువు. చొరవ చూస్తూ, చూస్తూ పెళ్ళయిన తర్వాత కూడా యిట్లా వుంటే బాగుండునని రావు అనుకుని సంతృప్తి చెందేవాడు. మొదట రావు తన వుద్దేశ్యాన్ని, మధుకు చెప్పటంతో, మొదటినుంచి సుజాత, వసంతల మధ్య వున్న వైరుధ్యభావాన్ని చక్కగా కనిపెడుతూ వస్తున్న మధుకు చాలా సంతోషం కలిగించింది. వసంతలో ఆకర్షణ యెక్కువే వుంది. కాని సుజాతలో ఒక స్థిమితమైన, గంభీరమైన మూర్తి కనిపిస్తుంది. నిశ్చలంగా, వడుదుడుకులు లేకుండా, తన జీవితాన్ని అతి సునాయాసంగా నడపగల చాతుర్యం ఆమెలో వున్నట్లు కనిపిస్తుంది. వసంత అనేక విషయాలమీద యే విధమైన ఆలోచన లేకుండా ఒక నిర్ణయానికి వస్తూవుండటం చూస్తూవుంటే సుజాతకు చాలా బాధ కలుగుతూ వుండేది. కాని ప్రతి విషయంలోను తన వయస్సును వుపయోగించుకోకూడదనే వుద్దేశంతో, కొన్నికొన్ని తండ్రికి చెప్పి సంతృప్తిపడేది. బాగా పరిచయంలేని వ్యక్తులు, వసంతను యేవిధంగా అనుకుంటారో అని బాధపడేవాడు రావు. వసంత, తనకు సుజాతకంటెయెక్కువ హక్కువున్నట్లు

ప్రవర్తిస్తూ వుండేది. రావు సుజాత యెవరో వసంత తెలుసుకుందేమోనని అనుమానపడేవాడు కూడా. కాని వసంతకు, ఆ విషయము తెలుసని అనుకోవటానికి కూడా రావుకు తగిన ఆధారాలులేవు. అయినా సుజాత మాత్రం రావుకు గట్టిగా చెప్పేసింది వసంతకు తెలుసని. ఆమె కారణాలు యేమిటో తెలియవు.

మధుపట్ల, వసంత ప్రవర్తన మొదట కొంచెం కటువు అనిపించినా, క్రమక్రమేణా, మారటం చూస్తూ ఉంటే, మధుకు అదోవిధమైన భయము వేసేది. రావు మనస్సులో యెవరికీ తెలియని బాధపడేవాడు. సుజాతమనస్సు అర్థం చేసుకోవటం కష్టం. మధుకు, రావు తన ఉద్దేశాన్ని చెప్పినప్పటినుంచి సుజాత పట్ల, తన ప్రవర్తనలో మార్పు వచ్చినట్లు సుజాత కూడా గ్రహించ లేకపోలేదు. తనకు తెలియకుండానే తనలో సిగ్గు ప్రవేశించినట్లు సుజాతకు అనిపించేది. అది యెంతవరకు సమంజసమో అని చాలా సేపు ఆలోచిస్తూ ఉండేదికూడ. వసంతకు తన కోర్కె బలంకావటానికి సుజాతపట్ల ద్వేషం అవసరమని భావించినట్లుంది. కాని మధు తన హద్దులేమిటో తెలుసుకొనే స్థితిలో లేనట్లున్నాడు.

ఆనాడు గదిలో వంటరిగా సుజాత పుస్తకాలు చూస్తూ, పడకకుర్చీలో పడుకుని ఉంది. మధు ఆ గది గుమ్మందాక వచ్చి సుజాతను చూడటం తోనే కొంచెం వెనక్కు తగ్గి చిరునవ్వుతో వెళ్ళిపోయాడు. సుజాత కూడా అనుకోకుండా నవ్వేగలిగింది. కాని మధుచిరునవ్వుకు యేదో అర్థం ఉంటుం దని సుజాత ఆలోచనలో పడింది. తనకు మధుకు జరిగిన సంభాషణలు, సంఘటనలు అన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటోంది ఎంతసేపటికీ చిరునవ్వు సమ న్వయం వాటిలో కనిపించలేదు. తనకు మధుకు యెంత పరిచయం ఉన్నా, ప్రేమ, పెళ్ళి విషయం యెవరూ తీసుకురాకపోవటం ఇప్పుడు అలాంటి అభి ప్రాయం తనకే ముందు కలిగిందేమోనని, అట్లా తనంతట తాను యేమి

అనుకోకూడదేమోనని, తన మనస్సు అనేక విధాలుగా పోతోంది. గదిగుమ్మం దగ్గర అడుగుల చప్పుడు వినిపించేటప్పటికి సుజాతకు సిగ్గు మరింత ఎక్కువైనట్లనిపించింది. తలెత్తింది కొంచెం ఓరకంటితో చూస్తూ, రావువస్తున్నాడు. రావు నిమిషంలోకి సుజాత ముఖం చూసి "ఏమిటి ఆలోచిస్తున్నావు" అన్నాడు అప్యాయంగా. సుజాత నవ్వింది చాలా అమాయకంగా, "అవుతే నీకు మధే చెప్పాడన్నమాట" అన్నాడు రావు జుట్టు నెమురుతూ. సుజాత ఆశ్చర్యంగా తండ్రివంక చూసింది.

"నా జీవితకాలము రోజుల్లోకి వచ్చేసింది" అన్నాడు రావు. "నాన్నా" అంటూ సుజాత వళ్లోకి వరిగింది.

"అమ్మా, ఈ తనువులు శాశ్వతంకాదు. నేను కోరేది వకటే. మీ యిద్దరి వివాహము చేసి ఆనందించి వెళ్ళిపోవటం. ఇంతమంది మనింటికి వచ్చినా ప్రత్యేకంగా మధును మనింట్లోనే అట్టే పెట్టుకోవటంలో నాకు మొద[illegible]చి యీ వుద్దేశం వుంది. మధు విషయంలో నీకు కాని, నీ విషయంలో మధు కాని చెప్పె అవసరం లేదు. మీ యిద్దరి జంట నాకు చాలా ఆనందంగా వుంటుంది. ఈ విషయమే మధుకు చెప్పాను కూడా అన్నాడు.

సుజాత క్రొత్త బాధ్యతలు యెట్లా స్వీకరించాలో అనే ఆలోచనలో పడిపోయింది.

మధుకు మాత్రం సుజాతను వివాహము చేసుకోవాలనివున్నా, వసంత పట్టు నెగ్గేటట్లుంటే మాత్రం యేమీ చెయ్యలేని పరిస్థితిలోనే వున్నాడు.

రోజులు దొర్లిపోతున్న కొద్దీ, వసంత ప్రవర్తన, సుజాతకు అనుమానాన్ని తెచ్చిపెట్టుతుందేమోనని, మధు భయపడుతున్నాడు రావుకు కొంచెం కొంచెంగా యిప్పుడిప్పుడే అర్థం అవుతోంది. ఈ విషయాన్ని వసంతతోకూడా చెప్పేరోజు వచ్చింది. ఆ ప్రస్తావన తేవటంతోనే వసంత చిర్రునలేచి వెళ్లి

పోవటం. రావుకు ఆశ్చర్యాన్ని కలిగించింది. సుజాత, స్పష్టంగా వసంత కోర్కెకు అడ్డురానని చెపుదామని యెంత ప్రయత్నించినా, వసంత అలాంటి అవకాశమే యివ్వటంలేదు. చివరకు సుజాత, మధుల పెళ్ళికనక అవుతే తన యీ వయస్సులో తాను వూహించలేని పరిస్థితులు రావచ్చునే భయము రావుకు బాగా కలిగినతర్వాతే మధును పిలిచి వున్నపరిస్థితిని చెప్పేశాడు. మధుకు ఈ విషయం క్రొత్త కాకపోవటం, పైగా దేనినైనా యెదుర్కొనే పరిస్థితిలో మధు లేకపోవటంవలన, తనఅంగీకారంకంటె యింకోవిషయము రావుకు చెప్పలేక పోయాడు. ఈ మాటలు సుజాత తలుపుచాటునుంచి విని దిగులుగా వెళ్ళిపోయింది.

వసంత మధులిద్దరు పల్లకీలో కూర్చుంటే, సుజాత సంతోషంగా వున్న ప్పటికి, రావు సుజాతనుచూసి చాలా బాధపడ్డాడు. యిప్పుడిప్పుడే మధు యెప్పుడైనా వంటరిగా కనిపిస్తూవుంటే, సుజాత తప్పుకుని వెళుతోంది. కాని వసంతమాత్రం, సుజాతను ఆ దృష్టితోనే చూడలేకపోతోంది. పైగా తనని అనుమానిస్తున్నట్లు సుజాతకూడ అప్పుడప్పుడు బాధపడుతోంది. మెల్లి మెల్లిగా మంచంలోవున్న రావు చెవిదాకకూడ యీవిషయాలు వెళుతున్నాయి. మధు కూడా సాధ్యమైనంతవరకు జాగ్రత్తగానే ప్రవర్తిస్తూ, వసంతను అనుమానా లకి దూరం చెయ్యాలనే ప్రయత్నంలోమాత్రం విఫలుడయ్యాడనే చెప్పా లసివస్తుంది. పైగా సుజాతకు మంచి సంబంధాన్ని వెతుక్కువచ్చే బాధ్యత కూడా తానే స్వీకరించాలని అనేటప్పటికి, మధుమనస్సు చివుక్కుమంది. ఇక సూటి పోటిమాటలు అందర్నీ బాధిస్తున్నాయి. "మొదటినుంచి అయ. నకు నీకు ముడిపెట్టేవుందిగా" అన్న వసంతమాట సుజాత హృదయాన్ని యెంతైనా గాయపరిచింది. మధు ఆవేదన అంతాయింతా కాదు. మంచంలో రావుకు పిచ్చియెత్తినట్లవుతోంది. రోజులు గడుస్తున్నకొద్దీ భేదాభిప్రాయాలు యెక్కువ అవటంకంటె యింకోటేమిటీ కనిపించటంలేదు.

ఆనాడు ఆసుపత్రిబైట మధు, సుజాతలు ఆదుర్దాగా నిలబడి వున్నారు

నర్సువచ్చి మగపిల్లాడంది.

ఇద్దరిముఖాల్లోను చిరునవ్వు నాట్యమాడింది. రావు సంతోషం పట్టలేక పోయాడు. కొద్ది క్షణాల్లోనే యింకోనర్సు గబగబవచ్చి వసంత పరిస్థితి చాలా ప్రమాదకరంగావుంది అంటూ కంగారుగా వెళ్లిపోయింది లోపలికి. ఇద్దరిముఖాలు వివర్ణాలు అయిపోయినాయి. క్షణాల్లోనే, మానవశక్తికి మించినపని అయిపోయింది. రావు మనస్సు పనిచెయ్యటం మానేసింది. మధు, సుజాతలు యేడుస్తూవుంటే, రావు పక్కన నవ్వి, "అమ్మాయీ సుజాత" అంటూ బిగ్గరగా అరిచాడు.

"నా వకకూతురు కొడుకును కనియిచ్చింది. ఈ కూతురు పెంచుతుంది. మీ యిద్దరు నా దగ్గరకు వక్కసారిరండి" అంటూ మధు సుజాతల కళ్ళలోకి చివరసారిగాచూసి, యీ బంధాల్లోంచి విముక్తయిపోయాడు రావు.

కథా నిలయం
3577
శ్రీకాకుళం